సాక్షి
జగిత్యాల
గురువారం । 17 । అక్టోబర్ । 2024

ఘనంగా కోజాగిరి పౌర్ణమి

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం రాత్రి కోజాగిరి పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో శేషప్ప కళావేదికపై స్థానిక కళాకారులు హరి నామస్మరణ, భక్తి సంగీత విభావరి నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటలకు పెద్ద గిన్నెలో పాలు పోసి చంద్రుడిని వీక్షించారు. ఆ పాలను భక్తులకు తీర్థప్రసాదాలుగా అందించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



న్యూస్‌రీల్

నేడు మహర్షి వాల్మీకి జయంతి

జగిత్యాల: మహర్షి వాల్మీకి జయంతిని కలెక్టరేట్‌లో గురువారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

జిల్లాకు ఏడుగురు ఏవోలు



డీఏవో రాంచంద్రంకు జాయినింగ్ రిపోర్టు ఇస్తున్న ఏవోలు

జగిత్యాలఅగ్రికల్చర్: ఇటీవల టీపీఎస్సీ ద్వారా నియామకమైన మండల వ్యవసాయాధికారుల్లో జిల్లాకు ఏడుగురిని ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు వారు బుధవారం జిల్లా వ్యవసాయ కార్యాలయంలో డీఏవో రాంచంద్రంకు జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు. సారంగాపూర్‌కు ప్రదీప్ రెడ్డి, వెల్గటూర్‌కు సాయికిరణ్, ఎండపల్లికి మహేశ్, ధర్మపురికి సింధూజ, బుగ్గారానికి అక్షిత, పెగడపల్లికి శ్రీకాంత్, టెక్నికల్ ఏవోగా దీప్తి నియామకం అయ్యారు. డీఏవో మాట్లాడుతూ.. నూతన ఏవోలు క్షేత్రస్థాయిలో ఉంటూ.. రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి



ర్యాలీగా తరలివెళ్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సిబ్బంది

జగిత్యాలటౌన్: పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్లు బుధవారం జిల్లాకేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో కళాశాలల నిర్వహణ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎంను కలిసేందుకు ప్రయత్నించినా ఆయన సమయం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి బకాయిలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్లు ముసిపట్ల రాజేందర్, శ్రీపాద నరేశ్, పోతని ప్రవీణ్, మూర్తి, ఆంజనేయులు, ప్రకాశ్, ప్రిన్సిపాల్స్ మునీందర్‌రెడ్డి, మల్లికార్జున్, 250మంది సిబ్బంది పాల్గొన్నారు.

కొండగట్టుకు చేరిన 1995 కిలోల నెయ్యి



నెయ్యిని తనిఖీ చేస్తున్న ఈవో రామకృష్ణ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో లడ్డూప్రసాదం తయారీకి ప్రభుత్వం నుంచి దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు విజయ డెయిరీ నుంచి 1995 కిలోల నెయ్యి పంపించారు. ఆలయ ఈవో రామకృష్ణారావు లడ్డూతయారీ కేంద్రానికి వెళ్లి నెయ్యి బరువును పరిశీలించారు. మొన్నటివరకు ఆలయానికి కరీంనగర్ డెయిరీ ద్వారా నెయ్యి సరఫరా అయ్యేది. కార్యక్రమంలో ఏఈఓ అంజయ్య, లడ్డూప్రసాద ఇన్‌చార్జి జెమిని శ్రీనివాస్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను ఎంపిక చేయాలి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్

జగిత్యాల: ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను ఎంపిక చేయాలని హౌసింగ్ కార్పొరేషన్ సీఈ ఈశ్వరయ్య అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రతి గ్రామంలో పంచాయతీ సెక్రటరీల ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని, వాటిని పరిశీలించి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా అన్ని అర్హతలు పరిశీలించి ఎంపీడీవోల ద్వారా లబ్ధిదారులను నమోదు చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ నియోజకవర్గాల వారీగా ఇళ్లను మంజూరు ఇస్తారని పేర్కొన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఈ రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఒక్కరోజు.. 25 ప్రసవాలు



- ఈ చిత్రంలో కన్పిస్తున్న ఆమె పేరు పుష్పలత. రాయికల్ మండలం చింతలూరు గ్రామం. భర్త కుమారస్వామి. జీవనోపాధి కోసం చిన్నచిన్న వ్యాపారం చేస్తూ ఉపాధి పొందుతుంటాడు. తొలి కాన్పు కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. పండంటి బాబుకు జన్మనిచ్చారు. డాక్టర్లు సాధారణ ప్రసవం కోసం చూసినా చివరకు సిజేరియన్ చేసి పురుడు పోశారు.



- ఈ చిత్రంలో కన్పిస్తున్నది నాగమణి. మేడిపల్లి మండల కేంద్రం. మొదటి కాన్పు కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. పండంటి బాబుకు జన్మనిచ్చింది. భర్త రాజం చిన్నచిన్న పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. డాక్టర్లు మంచిగా ఆదరించారని, ఎలాంటి ఇబ్బందులూ ఎదురుకాలేదని ఆనందం వ్యక్తం చేశాడు.



- ఈ చిత్రంలో కన్పిస్తున్నది జాడి కల్యాణి. ఆదిలాబాద్ జిల్లా జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామం. రెండో కాన్పు కోసం జగిత్యాల ఆస్పత్రికి వచ్చింది. పండంటి పాపకు జన్మనిచ్చింది. భర్త రవీందర్ డ్రైవర్ పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. రెండో కాన్పులో పాప పుట్టడంతో ఆనందం వ్యక్తం చేస్తూ డాక్టర్లకు అభినందనలు తెలిపారు.



- ఈ చిత్రంలో కన్పిస్తున్న ఆమె పేరు శైలజ. కథలాపూర్ మండలం గంభీర్‌పూర్. భర్త సతీశ్ డ్రైవర్‌గా పనిచేస్తాడు. జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి కాన్పుకోసం రాగా సిజేరియన్ చేసి పాపకు పురుడు పోశారు. ఆమె కుటుంబ సభ్యులు డాక్టర్లకు అభినందనలు తెలిపారు.



- ఈ చిత్రంలో కన్పిస్తున్న ఆమె పేరు మాధవి. గొల్లపల్లి మండలం బీబీరాజ్‌పల్లి. భర్త శ్రీకాంత్ వ్యవసాయం చేస్తుంటాడు. కాన్పు కోసం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా నార్మల్ డెలివరీ అయింది. డాక్టర్లు ఎంతో శ్రద్ధగా నార్మల్ డెలివరీ చేశారని, ఆనందంగా ఉందని పేర్కొంది.



బాలింతలతో మాతాశిశుసంరక్షణ కేంద్రం వైద్యుల ఆనందం

- తల్లీబిడ్డలందరూ క్షేమం
- రికార్డు సృష్టించిన మాతాశిశు కేంద్రం ఆస్పత్రి
- నిరంతర సేవలందించిన డాక్టర్లు, గైనకాలజిస్ట్‌లు
- వైద్యులకు వెల్లువెత్తిన అభినందనలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి (మాతాశిశు కేంద్రం)కి జిల్లాతోపాటు ఆదిలాబాద్, మంచిర్యాల, లక్సెట్టిపేట, నిజామాబాద్ ప్రాంతాల నుంచి అనేక మంది గర్భిణులు ప్రసవాల కోసం వస్తుంటారు. ఈ లెక్కన ఈ ఆస్పత్రిపై ప్రజలకు అంత నమ్మకం ఉందన్నమాట. ఈ ఆస్పత్రి ఎక్కువగా పేదలకు ఆలయంగా మారింది. అందులోనూ వైద్యులు కూడా అంకితభావంతో పనిచేస్తుంటారు. బుధవారం ఒక్కరోజే 24 గంటల్లో 25 డెలివరీలు చేసి రికార్డు సృష్టించారు. రిస్క్ కేసులను కూడా శ్రద్ధగా పరిశీలించి అంతే ఓపికగా డెలివరీ చేశారు. ఇందులో 12 నార్మల్ డెలివరీలు, 13 సిజేరియన్స్ ఉన్నాయి. మాతాశిశు సంక్షేమ కేంద్రంలో నెలకు సగటున 300కు పైగానే ప్రసవాలు జరుగుతాయి.

వైద్యుల కృషి

బుధవారం ఒక్కరోజే అత్యధికంగా కేసులు రావడంతో గైనకాలజిస్ట్‌లు ఇబ్బందులు, లోపాలు తలెత్తకుండా విధులు కొనసాగించారు. వైద్యులు ప్రవంతి, స్వరూప, ప్రొఫెసర్ అరుణ, మాధవి, ప్రొఫెసర్ రాములు, ఆర్ఎంవో యాకూబ్‌పాషా, నవీన్‌కుమార్, నర్సింగ్స్, ఏఎన్ఎంలు పక్కా ప్రణాళిక ప్రకారం ప్రతి కేసును పట్టి డెలివరీ చేశారు. ప్రతి డెలివరీలోనూ తల్లీబిడ్డలు క్షేమంగా, ఆరోగ్యంగా ఉండేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.

శిశువులందరూ క్షేమం

రోజంతా ఆస్పత్రిలోనే ఉన్నాం. పుట్టిన శిశువులందరూ క్షేమంగానే ఉన్నారు. ఇది వైద్యుల కృషితోనే సాధ్యమైంది. ప్రతి బిడ్డ మూడు కిలోలపైగానే ఉన్నారు. ఇన్ని డెలివరీలు చేయడం ఎంతో గొప్ప విషయం. – యాకూబ్ పాషా, ఆర్ఎంవో

అందరి కృషితోనే..

అందరి కృషితోనే ఒకేరోజులో 25 డెలివరీలు చేశాం. ఇంతమంది రావడంతో సవాల్‌గా తీసుకున్నాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓపికతో అందరినీ పరిశీలిస్తూ కాన్పులు చేశాం. ఇదో గొప్ప అనుభూతి. – డాక్టర్ ప్రవంతి, గైనకాలజిస్ట్

గుడుంబా గుప్పుమంటోంది

మెట్‌పల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి గుడుంబాకు బానిసయ్యాడు. అంతకుముందు కేవలం మద్యమే సేవించే ఈయనకు ఓ చోట కొందరు గుడుంబాను అలవాటు చేశారు. తక్కువ ధరకు రావడం, కిక్కు ఎక్కువగా ఉంటుందని చెప్పారు. దానివైపు మొగ్గు చూపిన సదరు వ్యక్తి గుడుంబాకు అలవాటుపడ్డాడు. కుటుంబసభ్యులు ఎంత మందలించినా మార్పురాలేదు. చివరకు అనారోగ్యం పాలై మృతి చెందాడు.

ఇదే మండలంలోని మరో గ్రామంలో గుడుంబా తయారీ, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గుడుంబా సేవిస్తున్న కొందరు మత్తులో తూగుతున్నారు. గుడుంబాకు అలవాటుపడిన కొందరి తీరును చూసి ఆ గ్రామస్తులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇలా వీరే కాదు చాలామంది గుడుంబాకు బానిసై జీవితాలు చిన్నాభిన్నం చేసుకుంటున్నారు.

- మెట్‌పల్లి మండలంలో జోరుగా తయారీ
- విచ్చలవిడిగా కొనసాగుతున్న విక్రయాలు
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



గుడుంబా పట్టుకున్న అధికారులు(ఫైల్)

మెట్‌పల్లిరూరల్: జిల్లాలో గుడుంబా గుట్టుగా గుప్పుమంటోంది. మారుమూల గ్రామాలు, అటవీ ప్రాంతాల్లో విచ్చలవిడిగా గుడుంబా తయారీ జరుగుతోంది. గుడుంబాను పూర్తిగా నిషేధించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం తయారీదారులకు పునరావాసం కల్పించినా ఆశించిన స్థాయిలో ఫలితం రాలేదు. ఆ సమయంలో కొన్నాళ్లు గుడుంబా తయారీకి బ్రేక్ పడినా.. తాజాగా పరిస్థితులు మళ్లీ మొదటికొచ్చాయి. ప్రస్తుతం గ్రామాల్లో అడ్డూఅదుపులేకుండా గుడుంబా తయారీ కావడం, సేవించే వారి సంఖ్య పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు గుడుంబాను అరికట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు మిన్నకుండిపోవడంతో ఆ శాఖ తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విక్రయాల జోరు.. దాడులు నిల్

మెట్‌పల్లి మండలంలో గుట్టు చప్పుడుకాకుండా కొందరు గుడుంబాను తయారుచేస్తున్నారు. మారుమూల గ్రామాల్లో గుడుంబాను తయారీ చేసి సమీప గ్రామాలు, పట్టణాలకు తరలించి విక్రయిస్తున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న కొందరి ద్వారా ఈ గుడుంబా విక్రయాలు జరుపుతున్నట్లు తెలిసింది. గతంలో గుడుంబాను విడిగా విక్రయించేది. ప్రస్తుతం బాటిళ్లు, ప్యాకెట్లలో నింపి విక్రయిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు అడ్డుకట్ట వేయడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో గుడుంబా మత్తులో తూగుతూ ఇష్టారీతిగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

నిబంధనలు తూచ్..

గుడుంబా తయారీకి హానికరమైన మత్తు పదార్థాలను వాడుతున్నారు. పటిక, బెల్లం, జీడిగింజలతోపాటు తదితర పదార్థాలతో చేస్తున్నట్లు సమాచారం. గుడుంబాను సంపూర్ణంగా అరికట్టాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం గుడుంబా తయారీకి వాడే బెల్లం విక్రయాలపై ఆంక్షలు విధించింది. ఎవరైనా 5 కిలోల కంటే ఎక్కువ బెల్లం కొనుగోలు చేస్తే వారి వివరాలను నమోదు చేయాలని నిర్ణయించింది. కొద్దిరోజుల పాటు ఈ నిబంధనలు అమలైనా ఆ తర్వాత పట్టించుకునేవారే లేకుండా పోయారు.

గుడుంబా వ్యవహారం 'పోలీస్‌బాస్' దృష్టికి..

అడ్డూఅదుపు లేకుండా మెట్‌పల్లి మండలంలోని కొన్ని గ్రామాల్లో గుడుంబా తయారీ, విక్రయాలు జరుగుతున్న విషయం కొన్నినెలల క్రితం జిల్లా పోలీస్ బాస్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆయన గుడుంబాకు అడ్డుకట్ట వేయాలని స్థానిక పోలీసులకు సూచించారు. ఆయన సూచనలతో ఏఎస్ఆర్‌తండా, ఆత్మనగర్‌తండాకు వెళ్లిన పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. 10 లీటర్ల గుడుంబా ఉన్నట్లు గుర్తించి, తయారీకి సంబంధించిన 500 లీటర్ల ముడిసరుకును పారబోశారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఇక్కడి ప్రాంతాల్లో విచ్చలవిడిగా గుడుంబా తయారవుతున్న ఎక్సైజ్ అధికారులు ఎందుకు అటువైపు కన్నెత్తి చూడడంలేదన్నదే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై మెట్‌పల్లి ఎక్సైజ్ సీఐ వినోద్ రాథోడ్‌ను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

'రోళ్లవాగు' ముంపు చెట్ల లెక్కింపు

- ఇప్పటివరకు లెక్కించినవి 18,688



చెట్ల కొలతలు తీస్తూ, నంబర్ వేస్తున్న కూలీలు

సారంగాపూర్: బీర్‌పూర్‌లోని రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునీకరణలో భాగంగా ముంపునకు గురైన అటవీశాఖ భూముల్లోని చెట్లను లెక్కిస్తున్నారు. బుధవారం వరకు 18,688 చెట్లను లెక్కించినట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు ఆధునీకరణ పనుల్లో అటవీశాఖకు చెందిన 900 ఎకరాల భూమి ముంపునకు గురవుతోంది. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం అటవీశాఖకు గొల్లపల్లి, పెగడపల్లి, వెల్గటూరు మండలాల్లోని రెవెన్యూ భూములను కేటాయించింది. దీంతో ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో 40 మంది కూలీలు చెట్టు ఎత్తు, వెడల్పు కొలత వేస్తున్నారు. ఇప్పటివరకు సగం విస్తీర్ణంలో లెక్కింపు పూర్తయ్యిందని డీఈ చక్రూనాయక్ తెలిపారు. జేఈ అనిల్, ప్రాజెక్టు మేనేజర్ మహేశ్, సూపర్‌వైజర్ మోహన్ తదితరులు ఉన్నారు.

అడవిలో దొంగలు పడ్డారు



నిల్వ చేసిన టేకు దుంగలు

మల్యాల: మానాల అటవీ ప్రాంతంలో కొందరు దుండగులు టేకు చెట్లను నరికివేస్తూ యథేచ్ఛగా తరలిస్తున్నారు. కొండల్‌చెరువు గండి అటవీ ప్రాంతంలో యంత్రాలతో చెట్లను నేలకూలుస్తూ తరలిస్తున్నారు. అటవీశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే ఇదంతా జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవైపు వన్యప్రాణులకు ఉచ్చులు బిగించి వధిస్తుండగా.. మరోవైపు టేకు కలపను తరలించుకుపోతున్నారు. అటవీ సంరక్షణను పర్యవేక్షించాల్సిన అధికారులు రోజుల తరబడి మానాల అటవీ ప్రాంతంవైపు వెళ్లకపోవడంతోపాటు దుండగులకు కలిసివస్తోంది. కలప తరలించేందుకు అధికారులే పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అటవీశాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించి కలప తరలిపోకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు మోక్షమెప్పుడో..?

- నిలిచిన రూ.2 కోట్ల పనులు
- నిధుల లేమితో ఇబ్బందులు
- ముందుకు రాని కాంట్రాక్టర్లు



జగిత్యాల: జిల్లాలోనే అతిపెద్దదైన జగిత్యాల బల్దియా నిధుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. దాదాపు రూ.2కోట్ల పనులకు టెండర్లు పూర్తయినా ఏడాదికిపైగా ఒక్క పని కూడా ముందుకు కదలడం లేదు. ఆస్తి పన్ను వసూలు కాకపోవడంతో బల్దియాలో సాధారణ నిధుల కొరత ఏర్పడింది. ప్రభుత్వం నుంచి నిధుల విడుదల నిలిచిపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. గతంలో కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పించాలని మున్సిపల్ కాంట్రాక్టర్లందరూ ఇటీవల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన మంత్రి భట్టి విక్రమార్కతో మాట్లాడి రూ.4 కోట్ల బడ్జెట్ విడుదల చేయించారు.

పనులు కొనసాగేనా..?

ఇప్పటికే చేసిన అభివృద్ధి పనులకు మాత్రమే బిల్లులు రావడంతో తాజాగా అభివృద్ధి పనులను తిరిగి చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకొచ్చేనా అనే సంశయంలో ఉన్నారు. ప్రస్తుతం టెండర్లు వేసి ఉన్న పనులు మొదలు పెడతారా..? లేదా..? అన్నది చర్చనీయాంశంగా మారింది. సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులు, డ్రెయినేజీ మరమ్మతు, పైప్‌లైన్లు ఇలాంటి చిన్నచిన్నవి రూ.2కోట్ల వరకు మిగిలిపోయాయి. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకొస్తున్నా నిధులు వస్తాయో..? లేదోనని ఆలోచిస్తున్నారు.

పట్టణ ప్రగతి ఎక్కడ..?

గతంలో ప్రతి మున్సిపాలిటీకి నెలకు రూ.50 నుంచి రూ.90లక్షల నిధులు గత ప్రభుత్వంలో వచ్చేవి. ఆ నిధుల ద్వారా పట్టణాల్లో సుందరీకరణ, పార్క్‌ల అభివృద్ధి, డ్రెయినేజీల నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నిధులు నిలిచిపోయాయి. జగిత్యాల మున్సిపాలిటీకి ఆస్తిపన్ను రూ.12 కోట్ల డిమాండ్ ఉన్నా.. వసూళ్లలో నిర్లక్ష్యం జరుగుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నిధులు తెప్పించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గతంలో టెండర్లు వేసిన దాదాపు రూ.2 కోట్లకు సంబంధించిన పనులు నిలిచిపోయాయి. ఇప్పుడు కాంట్రాక్టర్లకు సంబంధించిన రూ.4 కోట్ల నిధులు వచ్చాయి. నిలిచిపోయిన పనులు కొనసాగేలా చర్యలు తీసుకుంటాం. – చరణ్, ఏఈ

కలవరపెడుతున్న హత్యలు

- ఏడాదిన్నరలో నాలుగు ఘటనలు
- రౌడీషీటర్లపై నిఘా కరువు
- కోరుట్లలో గ్యాంగ్‌లు.. అడ్డాలు



కోరుట్ల: ఏడాదిన్నర వ్యవధిలో నాలుగు హత్యలు కోరుట్లలో జరగడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. హత్యల్లో పాలుపంచుకునే వారు.. హత్యకు గురవుతున్న వారు వీధుల్లో అడ్డాబ్యాచ్ వేస్తూ అసాంఘిక శక్తులుగా చలామణి అవుతున్న వారే కావడం విశేషం. వీరంతా చీకటిపడితే చాలు మద్యం, గంజాయి మత్తులో తూలిపోతున్నారు.

అడ్డాలు..గ్యాంగ్‌లు

కోరుట్లలో ఒక్కోవాడలో నాలుగు గ్యాంగ్‌లు కొనసాగుతున్నాయి. ఒక్కో గ్యాంగ్‌లో 20 మంది యువకుల వరకు ఉంటున్నాయి. వీరిలో చాలా మంది మద్యం, గంజాయి మత్తుకు అలవాటుపడి అర్ధరాత్రి దాటినా రోడ్లపై జల్సాలు చేసేవారే. రాత్రి 9 గంటలు దాటిందంటే చాలు.. ఎవరి అడ్డాల్లో వారు తిష్ట వేసి సెల్‌ఫోన్లలో పోర్న్ వీడియోలు చూడటం.. తోవలో వెళ్లే వారిని కామెంట్ చేయడం.. చివరికి పోలీసులు వచ్చినా ఖాతరు చేయకపోవడం షరామామూలుగా మారింది. ఇక్కడితో ఆగకుండా ఒక అడ్డా బ్యాచ్‌తో ఇతర అడ్డా బ్యాచ్‌ల యువకులు అమ్మాయిల విషయంలో తగాదాలకు దిగడం.. వ్యక్తిగత ఇమేజ్‌కు వెళ్లి దాదాలుగా పిలిపించుకునేందుకు తాపత్రయపడుతున్నారు. చివరికి ఆ అలవాట్లు హత్యలకు దారితీస్తున్నాయి. ఏడాదిన్నర వ్యవధిలో జరిగిన నాలుగు హత్యల్లో మూడు అడ్డాలు..గ్యాంగ్‌ల మధ్య జరిగిన గొడవలతోనే కావడం గమనార్హం. ఈ ఘటనలు కోరుట్లలో రోజురోజుకూ దిగజారుతున్న శాంతిభద్రతలకు అద్దం పడుతోంది.

పోలీసు నిఘా కరువు

పట్టణంలో అడ్డాలు పెడుతున్న బ్యాచ్‌లపై పోలీసు నిఘా కరువైంది. ప్రధాన రహదారుల వెంట ఎక్కడికక్కడ గద్దెలపై అడ్డాలు వేసి మరీ మద్యం సేవిస్తూ.. గంజాయితోకూడిన సిగరెట్లు కాల్చుతూ.. జల్సాలు చేస్తున్న యువకులపై పోలీసులు చూపుతున్న నిర్లిప్త వైఖరి కలవరపెడుతోంది. ఈ అడ్డా బ్యాచ్‌ల్లోకి రౌడీషీటర్లు చేరి మిగిలిన యువకులను నేరాల్లోకి లాగుతున్నారు. ఎప్పటికప్పుడు రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాల్సిన పోలీసులు పట్టించుకోవడం లేదన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పెట్రోలింగ్ వాహనం కేవలం మెయిన్‌రోడ్‌కే పరిమితం కావడంతో అడ్డాబ్యాచ్‌ల ఆగడాలకు అడ్డుకట్ట పడడం లేదు. పండుగల సందర్భాల్లో రౌడీషీటర్లు, నేర చరిత ఉన్న వారిని ఠాణాకు పిలిపించి హెచ్చరికలు జారీ చేయడంలోనూ పోలీసులు పెద్దగా పట్టింపుచూపెడుతున్న దాఖలాలు లేవు. ఇటీవల కాలంలో పోలీసులపై పట్టణంలోని కొన్నిచోట్ల అడ్డాబ్యాచ్‌లు తిరగబడినా చర్యలు లేకపోవడం విడ్డూరం. రాత్రివేళ బహిరంగంగా ఖాళీ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గంజాయి సిగరెట్లు తీసుకోవడం యువతకు ఫ్యాషన్‌గా మారిపోయింది. మత్తుకు బానిసలుగా మారుపోతున్న యువకులు నేరాలకు పాల్పడుతున్నారు. ఈ విషయంలో పోలీసులు అవసరమైన చర్యలు తీసుకోకుంటే పరిస్థితి మరింత దిగజారుతుందన్న ఆందోళన స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

అడ్డాలు వేస్తే చర్యలు

రోడ్లపై అడ్డాలు వేసి అలజడికి కారణమయ్యే యువకులపై కఠిన చర్యలు తీసుకుంటాం. బహిరంగంగా మద్యం సేవించడం నేరం. ప్రతిరోజూ రాత్రి వేళ పెట్రోలింగ్ పెంచుతాం. అసాంఘిక చర్యలకు పాల్పడుతున్న యువతను నియంత్రిస్తాం. – సురేష్‌బాబు, కోరుట్ల సీఐ

బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలరూరల్: జగిత్యాల నియోజకవర్గంలోని 14 బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేట నుంచి బాలపల్లి బీటీరోడ్డుకు రూ.24లక్షలు, చర్లపల్లి నుంచి కండ్లపల్లి వరకు రూ.50 లక్షలు, జగిత్యాల అర్బన్ మండలం అంబారి పేట నుంచి అంతర్గాం రోడ్‌కు రూ.48.06 లక్షలు, సారంగాపూర్ మండలం ఒడ్డెరకాలనీ, రంగపేట రోడ్డుకు రూ.64 లక్షలు, రంగపేట నుంచి ఆలూరు ఆర్అండ్‌బీ రోడ్ వరకు రూ.1.65 కోట్లు, అర్పపల్లి నుంచి శ్మశాన వాటిక వరకు రూ.74 లక్షలు, మోహరావుపల్లి నుంచి వ్యవసాయ పొలాల వరకు రూ.31.94 లక్షలు, రాయికల్ మండలం ఇటిక్యాల ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి మోడల్ స్కూల్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.64 లక్షలు, ఆర్అండ్‌బీరోడ్ నుంచి బషీర్‌పల్లి రోడ్ వరకు రూ.68 లక్షలు, అల్లీపూర్ నుంచి శ్రీరాంనగర్ ఎల్లమ్మ ఆలయం వరకు రూ.1.54 కోట్లు, చెర్లకొండాపూర్ నుంచి మైతాపూర్ వరకు రూ.1.86 కోట్లు, కిష్టంపేట నుంచి చల్‌గల్ వరకు రూ.1.56 కోట్లు, జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట నుంచి తాటిపల్లి ఆర్అండ్‌బీ రోడ్ వరకు రూ.50 లక్షల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తెలిపారు.

క్లుప్తంగా

బైక్ ఢీకొని వ్యక్తి మృతి


పెద్ద అంజయ్య (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని సిరికొండకు చెందిన చెట్పెల్లి పెద్ద అంజయ్య(56) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఎస్సై నవీన్ కుమార్ వివరాల ప్రకారం.. పెద్ద అంజయ్య సిరికొండలో సెలూన్ నిర్వహిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం టీ తాగేందుకు హోటల్‌కు వెళ్తుండగా వేగంగా వస్తున్న వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు కుటుంబసభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి కుమారుడు హరీశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గోరింటాలకు చెందిన ఒకరు..

గంభీరావుపేట(సిరిసిల్ల): రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి మృతిచెందాడని ఎస్సై శివకుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలంలోని గోరింటాలకు చెందిన బందెల రాజయ్య(56) మంగళవారం సాయంత్రం కూలీ పని ముగించుకొని, సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నాడు. మూలపల్లె స్టేజీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజయ్య తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యులు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుండెపోటుతో చిన్నారి..


శ్రీయాన్షి (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): ఆడిపాడే వయసులోనే ఆ చిన్నారికి నూరేళ్లు నిండాయి. గుండెపోటుతో నాలుగేళ్ల పాప మృతిచెందిన ఘటన జమ్మికుంటలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని పంగిడిపల్లికి చెందిన మేడిపల్లి రాజు–జమున దంపతులు బతుకుదెరువు కోసం జమ్మికుంట పట్టణానికి వచ్చారు. రాజు స్థానికంగా ఓ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ దంపతులకు ఒక పాప శ్రీయాన్షి(4), బాబు ఉన్నారు. శ్రీయాన్షి మంగళవారం కళ్లు తిరుగుతున్నాయని చెప్పి, తీవ్ర అస్వస్థతకు గురైంది. తల్లిదండ్రులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో చనిపోయింది. పాప పుట్టిన సమయంలోనే గుండె సంబంధిత సమస్యలు ఉన్నాయని, అప్పుడు గమనించకపోవడం వల్లే పరిస్థితి విషమించి, మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


నర్సయ్య (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): సంతానం కలగడం లేదని ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై పృథ్వీధర్ వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలంలోని మల్కాపూర్‌కు చెందిన బోడ నర్సయ్య (50) గొర్రెల కాపరి. అతనికి 18 ఏళ్ల క్రితం వివాహం కాగా, సంతానం కలగలేదు. దీంతో తరచూ మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో భార్య దసరా పండుగకు పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 15న ఉదయం నర్సయ్య క్రిమిసంహారక మందు తాగాడు. అతని సోదరుడి కుమారుడు రాకేశ్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం చనిపోయాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫీజు బకాయిలు రూ.150 కోట్లు


జిల్లాకేంద్రంలో మూసి ఉంచిన ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల

- ఎండమావిగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు
- మూతపడ్డ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు
- బీసీ సంక్షేమశాఖలో రూ.113.39 కోట్లు పెండింగ్
- ఎస్‌యూ పరిధిలో 64 డిగ్రీ, 35 పీజీ కళాశాలలు
- 52,663 మందికిపైగా విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరం


జగిత్యాలలో బుధవారం సుప్మా ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న కళాశాలల యాజమాన్యాలు

కరీంనగర్:

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల చెల్లింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న జాప్యంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.150కోట్ల బకాయిల కోసం యాజమాన్యాలు ఆందోళనకు దిగుతున్నాయి. కళాశాలలను బంద్‌చేసి రోడ్డెక్కుతున్నారు. ఫీజు చెల్లించాల్సిందేనంటూ విద్యార్థులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో 64 డిగ్రీ, 35 పీజీ ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. 52,663 మంది విద్యార్థులు చదువుతున్నారు. మూడేళ్ల నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో బకాయిలు కొండెక్కి కూర్చున్నాయి. ఒక్క బీసీ సంక్షేమశాఖకు సంబంధించిన బకాయిలు 2021–22, 2022–23, 2023–24 సంవత్సరాలకు సంబంధించినవే రూ.113.39 కోట్లు రావాల్సి ఉంది. దీంతో బిల్లులు చెల్లించాలని ఆందోళనకు దిగుతున్నారు.

చెల్లింపులకు మోక్షమెప్పుడో...

2021–22, 2022–23, 2023–24 విద్యా సంవత్సరాలకు సంబంధించి బీసీ విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ (ఆర్‌టీఎఫ్), స్కాలర్‌షిప్ (ఎంటీఎఫ్) కింద జిల్లాకు రూ.113 కోట్ల 39 లక్షల బకాయిలు రావాల్సి ఉంది. బీసీ సంక్షేమశాఖలో మూడేళ్లలో ఎంటీఎఫ్ కింద 34,102 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి మొత్తంగా రూ.3కోట్ల 34 లక్షల 65 వేల బకాయిలు రావాల్సి ఉంది. ఈబీసీ కేటగిరీలో ఆర్టీఎఫ్ కింద మూడేళ్లల్లో 3,755 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి రూ.96 కోట్ల 35 లక్షల 50వేలు రావాల్సి ఉంది. ఈబీసీ ఆర్‌టీఎఫ్ కింద రూ.13 కోట్ల 69 లక్షల 59 వేలు రావాల్సి ఉంది. 150 కోట్ల నుంచి బీసీ విద్యార్థులకు సంబంధించి 113 కోట్ల 39 లక్షలు పోను మిగితా 37 కోట్లు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉండటం గమనార్హం.

సర్టిఫికెట్లు ఇవ్వకుండా కొర్రీలు

స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగుతున్నాయి. పరీక్షలు సమీపిస్తుండడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఫీజుల పేరిట వేధింపులకు గురిచేస్తున్నాయి. ప్రశాంత వాతావరణలో పరీక్షలకు సన్నద్ధం కావాల్సిన తరుణంలో ఫీజు ఒత్తిడి మానసికంగా గందరగోళానికి గురి చేస్తోంది. చదువు పూర్తిచేసుకున్న విద్యార్థులకు టీసీలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడానికి పలు కళాశాలల యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయి. ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం కళాశాలకు వెళ్లి అడిగితే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు అందలేదని, వచ్చాకే సర్టిఫికెట్లు ఇస్తామని కొర్రీ పెడుతున్నారు. లేదంటే ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని సలహా ఇస్తున్నారు.

చదివిన బడిలోకే సారుగా..

- కొత్త టీచర్లలో పలువురికి దక్కిన అవకాశం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

'ఏళ్లుగా కష్టపడి చదివారు.. ప్రభుత్వ ఉద్యోగం సాధించేవరకు పట్టు వదల్లేదు.. చివరకు టీచర్, పీడీ కొలువులు సాధించారు.. కొలువు కోసం నిర్వహించిన పరీక్షలో విజయం సాధించడం ఒక ఎత్తయితే.. తాము చదువుకున్న బడిలోకే సారుగా వెళ్లడం వారి సంతోషాన్ని రెట్టింపు చేసింది. చిన్నప్పుడు ఆడిపాడి, అల్లరి చేసిన తమ పాఠశాలకు బుధవారం ఉద్యోగులుగా వెళ్లిన పీడీ రమేశ్, టీచర్లు వేణుకుమార్, రాజు ఆనందం వ్యక్తం చేశారు.'

ఆడుకున్న స్థలంలో అడుగుపెట్టా



రాయికల్(జగిత్యాల): నేను చదువుకుంటూ, ఆడిపాడిన పాఠశాలలోనే పీడీగా ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది. ఆడుకున్న స్థలంలో అడుగుపెట్టడం ఒక క్రీడాకారుడిగా, పూర్వ విద్యార్థిగా గర్వంగా ఉంది. రాయికల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3 నుంచి 5వ తరగతి వరకు, జెడ్పీహెచ్‌ఎస్‌లో 6 నుంచి 8వ తరగతి వరకు, కట్లకుంట జెడ్పీహెచ్‌ఎస్‌లో 9, 10వ తరగతులు, మేడిపల్లి గురుకులంలో ఇంటర్మీడియట్ చదివాను. చదువుకున్న రాయికల్ హైస్కూల్‌లోనే నేను పీడీగా ఉద్యోగం సాధించడం చెప్పలేని అనుభూతినిస్తోంది. విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తయారు చేసేందుకు నావంతు ప్రయత్నం చేస్తా.

– పుర్రె రమేశ్ పీడీ, రాయికల్ హైస్కూల్

కలలో కూడా ఊహించలేదు



రుద్రంగి(వేములవాడ): మాది రుద్రంగి మండల కేంద్రం. నేను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్నాను. విద్యాబుద్ధులు నేర్పిన బడిలో టీచర్‌గా చేరడం చెప్పలేని ఆనందాన్నిస్తోంది. ఇది నేను కలలో కూడా ఊహించలేదు. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తూ, వారు క్రమశిక్షణతో మెలిగేలా చూస్తా. సమాజంలో మంచి పౌరులుగా ఎదిగేందుకు, మంచి మార్కులతో ఉత్తీర్ణలయ్యేందుకు నా వంతు కృషి చేస్తా.

– వేణుకుమార్, టీచర్, జెడ్పీ హైస్కూల్, రుద్రంగి

చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తొస్తున్నాయి



గంభీరావుపేట(సిరిసిల్ల): మాది గంభీరావుపేట. నేను స్వగ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోనే చదువుకున్నాను. ఇప్పుడు ఇదే బడిలో స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లిష్)గా ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. పాఠశాలలో ఉంటే నా చిన్ననాటి జ్ఞాపకాలు, నాకు చదువు చెప్పిన సార్లు గుర్తొస్తున్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తా.

– శనిగరపు రాజు, టీచర్, జెడ్పీ బాలుర హైస్కూల్, గంభీరావుపేట

విధుల్లో చేరిన 12 మంది టీచర్లు



మంథని: డీఎస్సీ–2024లో ఎంపికైన 12 మంది(పది మంది స్కూల్ అసిస్టెంట్లు, ఇద్దరు ఎస్జీటీలు) కొత్త టీచర్లు మంథని మండలంలో తమకు కేటాయించిన పాఠశాలల్లో బుధవారం విధుల్లో చేరారు. తొలుత వారికి ఎంఈవో లక్ష్మి, ఆరెంద కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీలత జాయినింగ్ ఆర్డర్ అందజేశారు. సీఆర్పీ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జాయినింగ్ ఆర్డర్ ఇస్తున్న ఎంఈవో లక్ష్మి

అధిక వడ్డీ పేరిట డబ్బుల వసూలు

- అన్నపై తల్లితో కలిసి తమ్ముడి ఫిర్యాదు
- ప్రజలు మోసపోవద్దని సూచన



మాట్లాడుతున్న కమలాకర్, రామవ్వ

సిరిసిల్లటౌన్: అధిక వడ్డీ ఆశచూపి, ప్రజల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నాడంటూ ఓ వ్యక్తిపై సొంత తమ్ముడే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో అతను వివరాలు వెల్లడించాడు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన జిందం రాజు రెండేళ్లుగా కర్పూరం బిజినెస్ చేస్తున్నానంటూ అమాయకులకు అధిక వడ్డీ ఆశ చూపి, డిపాజిట్లు సేకరిస్తున్నాడు. రూ.లక్ష ఇస్తే రోజుకు రూ.300 వడ్డీ ఇస్తానని చెప్పి, తీసుకున్న మొత్తం నుంచే చెల్లిస్తున్నాడు. నెలకు రూ.9 వేల వడ్డీ రావడంతో పలువురు పెద్ద మొత్తంలో రాజుకు డబ్బులిస్తున్నారు. గత ఏప్రిల్‌లో సిరిసిల్లలోని పలువురు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఆ సమయంలో రాజుపై 420 కేసు నమోదు చేశారు. కాగా, స్టేషన్ బెయిల్ కావడంతో అతను మళ్లీ ప్రజల నుంచి డిపాజిట్లు సేకరిస్తున్నాడు. ఎలాంటి కష్టం లేకుండా కోటీశ్వరుడు కావాలన్న తలంపుతో రాజు ఇలా చేస్తున్నాడంటూ అతని తమ్ముడు కమలాకర్, తల్లి రామవ్వ సెప్టెంబర్ 2న ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అయినా, రాజు ఎలాంటి భయం లేకుండా లేని కర్పూరం కంపెనీని ఉన్నట్లు చూపుతూ సులభంగా వస్తున్న డబ్బుతో ఒంటిపై బంగారం వేసుకొని, గోల్డ్‌మెన్‌గా అందరి దృష్టిలో పడ్డాడని ఆరోపిస్తున్నారు. ప్రజలు రాజును నమ్మి మోసపోవద్దని సూచిస్తున్నారు. అతను గతంలోనూ మోసాలకు పాల్పడ్డాడని, డిపాజిట్లు చేసినవారు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

ఊడిపోయిన ఆర్టీసీ బస్సు రాడ్డు

- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం


రోడ్డుపై నిలిచిపోయిన బస్సు

రాయికల్(జగిత్యాల): జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం రాయికల్ నుంచి జగిత్యాల వైపు వెళ్తోంది. అల్లీపూర్ శివారులో ఒక్కసారిగా బస్సు కింది భాగంలోని రాడ్డు ఊడిపోయింది. డ్రైవర్ అప్రమత్తమై, బస్సును నిలిపివేశారు. దీంతో మొత్తం 53 మంది ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. ఈ సందర్భంగా డ్రైవర్‌ను పలువురు అభినందించారు.

పాఠశాల ల్యాబ్‌లో చోరీ


ల్యాబ్‌లో పరిశీలిస్తున్న పోలీసులు

రామడుగు(చొప్పదండి): మండలంలోని గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ల్యాబ్‌లో మంగళవారం రాత్రి గుర్తు తెలియ ని వ్యక్తులు చొరబడ్డారు. పలు సైన్స్ పరికరాలను ఎత్తుకెళ్లారు. వాటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని ఎంఈవో వేణుకుమార్ తెలిపారు. పోలీసులు బుధవారం ల్యాబ్‌ను పరిశీలించారు. ఎంఈవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆన్‌లైన్ మోసం.. రూ.లక్షల్లో నష్టం

- యాప్ తెరుచుకోక పోవడంతో బాధితుల ఆందోళన


యాప్‌ను చూపుతున్న బాధితుడు

జగిత్యాల క్రైం: ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ చెల్లిస్తామని ఆశ చూపితే, పెట్టి మోసపోయిన పలువురు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన కొంతమంది ఒక్కొక్కరు రూ.లక్ష వరకు ఆర్జీఏ యాప్‌లో పెట్టుబడి పెట్టారు. మూడు రోజులు పని చేసిన ఆ యాప్ మంగళవారం నుంచి తెరుచుకోవడం లేదు. దీంతో బాధితులు తాము నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టించిన వ్యక్తికి ఫోన్ చేస్తే తనకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నాడని వాపోతున్నారు.

మిస్డ్ కాల్‌తో ఓటు నమోదు చేసుకోండి

- పట్టభద్రులకు హెల్ప్‌లైన్ 92400 21444
- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరేందర్ రెడ్డి తదితరులు

కొత్తపల్లి/కరీంనగర్: పట్టభద్రులు 92400 21444 హెల్ప్‌లైన్ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి, ఓటు నమోదు చేసుకోవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి కోరారు. బుధవారం కరీంనగర్‌లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో మిస్డ్ కాల్ క్యాంపెయిన్ పోస్టర్ ఆవిష్కరించారు. పట్టభద్రుల ఓటు నమోదుకు సహకరించేందుకు 50 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఒక కలర్ ఫోటోతోపాటు ఒరిజినల్ డిగ్రీ మెమోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. తనను ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాల్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలకు పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏలు మంజూరయ్యేలా చూస్తానన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు ప్రత్యేక యాప్ రూపొందించి, 6 నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇప్పిస్తానని తెలిపారు. ఉమ్మడి నాలుగు జిల్లాల్లో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. వివిధ కళాశాలల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో సత్తా


పతకాలు సాధించిన ఉమ్మడి జిల్లా రెజ్లర్లు

కరీంనగర్‌రూరల్: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెజ్లర్లు సత్తా చాటారు. హైదరాబాద్‌లో మంగళ, బుధవారాల్లో జరిగిన ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–19 రెజ్లింగ్ పోటీల్లో మూడు రజత, ఆరు కాంస్య పతకాలు సాధించారు. రుక్మాపూర్ సైనిక్ పాఠశాలకు చెందిన పి.విజయ్‌కుమార్, టి.సిద్ధార్థలు రజత, బి.నర్సింహ, కె.రాజరథన్, ఎన్.దినేశ్‌లు కాంస్య పతకాలు గెలిచారు. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాలకు చెందిన కె.రాజు రజత, కె.అజయ్ కాంస్య, అల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు చెందిన వి.రఘుచరణ్ కాంస్య, ట్రినిటీ జూనియర్ కళాశాలకు చెందిన సీహెచ్.ఆదిత్య మహరాజ్ కాంస్య పతకాలు సాధించినట్లు టీం కోచ్ ఎం.వంశీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ కరీం, కళాశాలల క్రీడా సమాఖ్య కరీంనగర్ జిల్లా కార్యదర్శి మధు జాన్సన్ అభినందించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

- నర్మాల ఎగువ మానేరులో దూకి అఘాయిత్యం
- మృతుడిది కామారెడ్డి జిల్లా

గంభీరావుపేట(సిరిసిల్ల): అప్పుల బాధతో ఓ వ్యక్తి నర్మాల ఎగువ మానేరులో దూకి, ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శివకుమార్ వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఇసాయిపేటకు చెందిన గుడ్లపల్లి ప్రకాశ్(55) కూలీ పనుల నిమిత్తం ఇదే మండలంలోని వెల్పుగొండలో నివాసం ఉంటున్నాడు. కూతురి వివాహం, భార్య ఆస్పత్రి ఖర్చులతో అప్పులపాలయ్యాడు. వాటిని ఎలా తీర్చాలంటూ కుటుంబసభ్యులతో నిత్యం బాధ పడేవాడు. ఈ క్రమంలో మంగళవారం కూలీ పనికి వెళ్తున్నానని చెప్పి, బయటకు వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికారు. అయినా, ఫలితం లేకపోయింది. బుధవారం గంభీరావుపేట మండలంలోని నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు సమీపంలో అతని దుస్తులు కనిపించాయి. దీంతో ప్రాజెక్టులో పరిశీలించగా ప్రకాశ్ మృతదేహం కనిపించింది. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తెలంగాణ స్టేజీ–2లో కదలిక

- పీసీబీకి వివరాలు అందజేసిన ఎన్టీపీసీ
- డిసెంబర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ?



జ్యోతినగర్(రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీ ప్రాంతంలో తెలంగాణ స్టేజీ–2 విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనులు ప్రారంభించేందుకు మార్గం సుగమమైంది. దీనికింద చేపట్టే 2,400 (ఒక్కోటి 800 మెగావాట్లు గల మూడు యూనిట్లు) మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు పూర్తి వివరాలతో కూడిన డాక్యుమెంట్లను ఎన్టీపీసీ టీటీఎస్‌లోని కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు బుధవారం అందజేశారు. రామగుండం పాత యాష్ పాండ్ ఏరియాలో స్టేజీ–2 ప్లాంట్ నిర్మాణం కోసం సుమారు 606 ఎకరాలు ఇప్పటికే సేకరించారు. వచ్చే డిసెంబర్‌లో దీనికి సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ చేపడతారని అధికారులు వివరించారు. తెలంగాణ పునర్విభజన చట్టంలో 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు నిర్మించాలనేది నిబంధన. ఇందులో భాగంగా స్టేజీ–1లో ఇప్పటికే 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంగల రెండు యూనిట్లు నిర్మించారు.

భూగర్భ గనుల్లో ఐదేళ్ల అనుభవం

- యువ కార్మికులకు తప్పనిసరి
- సింగరేణిలో నిబంధనల మార్పు!



గోదావరిఖని(రామగుండం): సింగరేణి యువ కార్మికులు ఇకనుంచి భూగర్భగనిలో ఐదేళ్లపాటు పనిచేయాల్సిందేనా? విధుల్లో చేరగానే అండర్‌గ్రౌండ్‌లో విధులు నిర్వర్తించాల్సిందేనని మెలిక పెడుతున్నట్లు సమాచారం. ఈమేరకు నిబంధనలు మార్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈమేరకు సంస్థ సీఎండీ బలరాం అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. యువకార్మికుల విషయంలో యాజమాన్యం ఇకనుంచి కఠినంగా వ్యవహరిస్తుందని సమాచారం. బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనపై జీఎంలతో ఇటీవల సమీక్షించిన సీఎండీ.. తాజా వ్యాఖ్యలు చేయడంతో యువ కార్మికుల్లో ఆందోళన మొదలైంది. మహిళా కార్మికులు కూడా భూగర్భగనుల్లో పని చేయాల్సిందేనని అంటున్నారు.

15 వేల మంది యువ కార్మికులు..

సంస్థలో సుమారు 15వేల మంది యువ కార్మికులు ఉన్నారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన వారిస్థానంలో వారిపిల్లలకు ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ఉద్యోగాల్లో చేరిన చాలా మందిలో ఉన్నత విద్య అభ్యసించిన వారే ఉన్నారు. విద్యార్హతలకు సమానస్థాయిలో ఉద్యోగాలు కావాలనే పట్టుదలతో వారు ఉన్నారు. లేనిపక్షంలో పక్షంలో కనీసం ఉపరితల పనులు ఇవ్వాలని కోరుతున్నారు. ఈక్రమంలో అండర్‌గ్రౌండ్(భూగర్భ)గనుల్లో పనిచేసేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని యాజమాన్యం పేర్కొంటోంది. అయితే ప్రతీ అంశానికి భూగర్భగనిలో పనిచేసిన అనుభవం తప్పనిసరి కావడంతో యువకార్మికులను అందులో విధులు నిర్వహించాల్సిందేనని నిర్ణయించినట్లు సమాచారం.

పెరిగిన రాజకీయ జోక్యం..

సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో చాలామంది కార్మికులు విధుల్లో చేరీచేరగానే లైట్ జాబ్‌లవైపు దృష్టి సారిస్తున్నట్లు చెబుతున్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలతోపాటు రాష్ట్రంలోని అధికారం కాంగ్రెస్, దేశంలోని బీజేపీ ప్రజాప్రతినిధులు సింగరేణి అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో చాలామంది భూర్భగనుల్లోకి వెళ్లకుండా డిపార్ట్‌మెంట్లు, ఓసీపీల్లో విధులు కల్పించాలని ఒత్తిడి తీసుకొస్తున్నట్లు యాజమాన్యం గుర్తించింది.

గైర్హాజరు కార్మికులపై సీరియస్

యువకార్మికుల్లో చాలామంది విధులకు గైర్హాజరవుతున్నారనే విషయాన్ని యాజమాన్యం గుర్తించింది. వివరాలు సేకరించిన అధికారులు.. ఇప్పటికే గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏడాదిలో వంద మస్టర్ల కన్నా తక్కువ ఉన్న కార్మికులపై ఫోకస్ పెట్టారు. ఈక్రమంలో గైర్హాజర్ కార్మికుల వివరాల సేకరిస్తున్నారు. డ్యూటీలు చేయని వారిని విధుల్లోంచి తొలగించాలని సీఎండీ ఆదేశాలు జారీచేయడంతో గైర్హాజరు కార్మికుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారే పరిస్థితి నెలకొంది.

మహిళా కార్మికులకు అండర్‌గ్రౌండ్ డ్యూటీ

సంస్థలో మహిళా కార్మికుల సంఖ్య పెరిగింది. అయితే ఇప్పటివరకు మహిళా కార్మికులు డిపార్ట్‌మెంట్లు, జీఎం కార్యాలయాలు, గని ఉపరితలాలపై పనిచేస్తున్నారు. ఇకనుంచి వారిని కూడా భూగర్భ గనుల్లోకి పంపించాలనే యోచనలో యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన విధి విధానాలను ఖరారు చేస్తున్నట్లు చెబుతున్నారు. కోలిండియాలో మహిళా కార్మికులు పనిచేస్తున్న క్రమంలో సింగరేణిలో కూడా వారి సేవలను భూగర్భగనుల్లో వినియోగించుకోవాలని చూస్తున్నారు.

భూగర్భ గనిలో పని చేయాల్సిందే..



కొత్తగా ఉద్యోగాల్లో చేరిన యువ ఉద్యోగులు ఐదేళ్లు అండర్‌గ్రౌండ్‌లో పనిచేయాల్సిందే. భూగర్భగనుల్లో అనుభవం ఉన్న సీనియర్ కార్మికులు ఉద్యోగవిరమణ పొందారు. వారిస్థానంలో పనిచేసేవారు తగ్గిపోతున్నారు. దీంతో భూగర్భగనుల్లో కార్మికుల సంఖ్య తగ్గింది. ఆ లోటు భర్తీ చేసేందుకు జూనియర్లకు విధులు కేటాయిస్తాం. అ లాగే మహిళా కార్మికులను కూడా భూగర్భగనుల్లో విధులు కేటాయించేలా ఆలోచన చేస్తున్నాం.

– బలరాం, సింగరేణి సీఎండీ